నిరుద్యోగ నిర్మూలనకు మూడంచెల విధానం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- వైరాలో మెగా జాబ్ మేళాకు భారీ స్పందన



జాబ్‌మేళాలో నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులతో భట్టి విక్రమార్క, రఘురాంరెడ్డి, రాందాస్‌నాయక్ తదితరులు

వైరా, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ నిర్మూలనకు మూడు అంచెలవిధానాన్ని అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రమైన వైరాలో శనివారం సింగరేణి కాలరీస్ సహకారంతో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను భట్టి విక్రమార్క జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యోగ నియామకాల కోసమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అయితే గత పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను వంచించిందని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో ఉద్యోగాలను భర్తీ చేయని కారణంగా అనేక మందికి వయస్సు దాటి పోయి, చివరకు ఉద్యోగాలు రాక పెళ్లిళ్లు కూడా చేసుకోలేక పిచ్చోళ్లుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇప్పటివరకు 56వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. మరో 30వేల ఉద్యోగాల భర్తీకి (మిగతా 6వ పేజీలో)


అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- జోడెడ్లలా సాగుతున్న ప్రజాపాలన
- నిర్ణీత గడువులో అంతర్గత రహదారుల నిర్మాణం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచి మండలంలో విస్తృత పర్యటన

6



పోచారం-తాళ్లచెరువు రహదారి పనులకు ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి



ఇప్పుడో.. అప్పుడో అంటూ వాయిదాలు పడుతూ వస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలపై మరోసారి చర్చ మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలతో పాటు భూభారతి వంటి చట్టాలు జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున అమల్లోకి వస్తున్నందున్న జూన్, జూలైలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల నిర్వహణపై కసరత్తు చేస్తున్నట్టు రాజకీయ పార్టీలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రధాన పార్టీలు స్థానికసంస్థల ఎన్నికలే అజెండాగా ఉమ్మడి జిల్లాలో కార్యక్రమాలు చేపడుతున్నాయి. జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు ఇటీవల కాలంలో ఆయా నియోజకవర్గాల్లో ముమ్మరంగా పర్యటిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. వచ్చే వానాకాలంలోగా పనులు పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నారు. అధికార పక్ష ఎమ్మెల్యేలు కూడా తమ కోటా కింద నిధులతో పనులను, ప్రతిపాదనలు, మంజూరులు సాగిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలు కూడా సిద్ధమవుతున్నాయి. రాజీవ్ యువ వికాసం కింద నిరుద్యోగులకు మంజూరుపత్రాలు అందించ బోతున్నారు.

స్థానిక పోరుకు సన్నాహాలు!

- జూన్, జూలైలో ఎన్నికలు జరుగుతాయని ప్రచారం
- అభివృద్ధి కార్యక్రమాలపై అధికార పార్టీ దృష్టి
- గ్రామాల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో మంత్రులు బిజీ
- ఎన్నికలపై దృష్టిసారించిన రాజకీయపార్టీలు

ఖమ్మం, మే 24 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వర్షాకాలం వస్తున్నందున అభివృద్ధి పనుల నిర్వహణకు కొంత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. దాంతో ఈ వర్షాకాలంలోనే పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మునిసిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ సిబ్బంది, అధికారులను ముందుగానే ప్రభుత్వం నిర్ణయించింది. శిక్షణ కార్యక్రమాలు కూడా పూర్తి చేసింది. అయితే బీసీ రిజర్వేషన్ 42శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడంతో కేంద్రం వద్ద ఈ బిల్లు పెండింగ్‌లో ఉంది. ఇది ఇప్పట్లో పరిష్కారమయ్యే పరిస్థితి లేకపోవడంతో గత రిజర్వేషన్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహిస్తే పార్టీ పరంగా 42 శాతం టికెట్లు బీసీలకు ఇచ్చేలా కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం అధికార పార్టీ ఇప్పటికే సంస్థాగత కమిటీలను నియమిస్తోంది.

నామినేటెడ్ పదవులకు 'స్థానిక' ఫలితాలతో ముడి!

సంస్థాగత కమిటీల నియామకంలోనూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించే వారికి మాత్రమే పార్టీలో పదవులు ఇస్తామని అధికార పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాలు ఇస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఏడాదిన్నర కావస్తున్నా పంచాయతీ, మండల, జిల్లాపరిషత్, మునిసిపాలిటీలకు ఎన్నికలు లేకపోవడంతో పాలక వర్గాలు లేక గ్రామాల్లో అభివృద్ధి సందడి కనిపించడం లేదు. పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు కూడా మంజూరు కావడం లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశం పరిష్కారం కావాలంటే చాలాకాలం పట్టే అవకాశం ఉండడంతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది.

ఇరు జిల్లాల్లో పంచాయతీలు ఇలా..

ఖమ్మం జిల్లాలో 579 పంచాయతీలు, 5,288వార్డులు, 8,24,063మంది ఓటర్లు ఉన్నారు. 20 జడ్పీటీసీలు 287 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం ఖమ్మం కార్పొరేషన్ పదవికాలం ఏడాది ఉండగా మధిర, వైరా, సత్తుపల్లి మునిసిపాలిటీల పాలకవర్గం పదవీకాలం పూర్తయ్యింది. కొత్తగా ఏర్పడిన ఏదులాపురం మునిసిపాలిటీకి కూడా ఎన్నికలు జరగాల్సి ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 478 పంచాయతీలు, 4,232 వార్డులున్నాయి. 22 జడ్పీటీసీలు, 236 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. కొత్తగూడెం, ఇల్లెందు మునిసిపాలిటీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. పాల్వంచ మణుగూరు షెడ్యూల్ ఏరియాలో ఉన్నందున వాటికి ఎన్నికల నిర్వహణ ఇబ్బందిగా ఉంది. అయితే కొత్తగూడెం పాల్వంచ నగరాలను కలుపుతూ కార్పొరేషన్‌గా మారుతున్నందున ఇంకా పూర్తిస్థాయిలో ప్రక్రియ పూర్తయితే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. మొత్తం మీద వచ్చే జూన్, జూలైలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి ఉంటుందన్న ప్రచారంతో ఆయా రాజకీయ పార్టీల కేడర్‌లో ఉత్సాహం కనిపిస్తోంది. ఇటు అధికార కాంగ్రెస్‌తో పాటు విపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాలు కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టిపెట్టి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.



మూడు నెలలకు ఒకేసారి రేషన్

- లబ్ధిదారులకు బియ్యం పంపిణీకి నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

6

సింగరేణిలో మైనింగ్ అధికారుల బదిలీలు

రుద్రంపూర్(సింగరేణి), మే 24(ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని వివిధ ఏరియాల్లో పని చేస్తున్న పలువురు మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులు వెంటనే కేటాయించిన ఏరియాల్లో చేరాలని ఆదేశించింది. ఆర్జీ-1లో డీవైజీఎంగా పని చేస్తున్న కే. చంద్రశేఖర్‌ను మణుగూరు ఓపెన్‌కాస్టుకు బదిలీ చేశారు. ఆర్జీ-3లో సేఫ్టీ డీవైజీఎంగా పని చేస్తున్న కే.రాంమోహన్‌ను రామగుండం-3కి బదిలీ చేశారు. మణుగూరు ఓసీలో డీవైజీఎంగా పని చేస్తున్న శ్రీనివాసచారిని రామగుండం-1కు బదిలీ చేశారు. ఇల్లెందులో డీవైజీఎంగా పనిచేస్తున్న రామస్వామిని ఎస్‌వోటు జీఎం ఇల్లెందుకు (మిగతా 6వ పేజీలో)

వర్షాకాలంలోపు అభివృద్ధి పనులు పూర్తి కావాలి

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల
- రఘునాథపాలెం మండలంలో రూ.కోటి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



ప్రజలతో మమేకమై మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 24 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల దృష్ట్యా వర్షాకాలం ముందే వచ్చే అవకాశం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ మేరకు ప్రభుత్వశాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని కోటపాడు, కోయచెలక-కమలాపురంలో రూ.కోటితో చేపట్టిన రహదారి, సైడ్ డ్రెయినేజీ, వంతెనల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ రాజ్యంలో అర్హత కలిగిన ప్రతి వ్యక్తికి సంక్షేమ పథకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. అంతర్గత సీసీ రహదారులు, డ్రెయినేజీలు, మైనర్ వంతెనలు, ప్రధాన రహదారుల పనులను వర్షాకాలంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పేద ప్రజలకు తొలి విడతలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయన్నారు. మంత్రి అధికారులను ఆదేశించిన తీరు చూసిన స్థానిక నాయకులు ఉమ్మడి రాష్ట్రంలోని జన్మభూమి సభలను గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

698 కేజీల గంజాయి సీజ్

- టేకులపల్లి వద్ద వాహన తనిఖీల్లో పట్టివేత
- పట్టుబడ్డ గంజాయి విలువ రూ.3.49కోట్లు

కొత్తగూడెం, మే 24 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీసీఎస్ పోలీసులు, టేకులపల్లి పోలీసులు సంయుక్తంగా శనివారం టేకులపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ సమీపంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుకున్నారు. గంజాయి తరలింపుపై విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు వాహన తనిఖీలు చేపట్టి ఒక కారు, ఒక వ్యాన్‌ను తనిఖీ చేయగా ఈ రెండు వాహనాల్లో 698 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి విలువ (మిగతా 6వ పేజీలో)



కొవిడ్‌పై భయం వద్దు

- జలుబు, దగ్గు వస్తే అప్రమత్తంగా ఉండాలి
- ఖమ్మం జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతిబాయి

ఖమ్మం కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎలాంటి కొవిడ్ కేసులు నమోదు కాలేదని, ప్రజలు కొవిడ్ పట్ల భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ఖమ్మం జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతిబాయి తెలిపారు. రాష్ట్రంలో కొవిడ్ కేసు నమోదవడం పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నట్లు వస్తున్న వార్తలపై ఆమె స్పందించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్యశాఖ అప్రమత్తంగా ఉందని, అయితే కొవిడ్ కేసులు నమోదైనట్లు వైద్య శాఖ ధ్రువీకరించలేదన్నారు. జిల్లాలో కూడా ఎక్కడా కేసులు నమోదు కాలేదన్నారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జలుబు, దగ్గు వస్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. జనసమూహాలు కలిగిన ప్రాంతాల్లో మాస్కు ధరిస్తే ముందస్తుగా ఎలాంటి రోగాలబారిన పడే ఆస్కారం ఉండదన్నారు. ప్రజలు ఆందోళన వీడి అప్రమత్తంగా ఉండాలన్నారు. జలుబు, జ్వరం, దగ్గు వస్తుంటే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని డీఎంహెచ్‌వో సూచించారు.

పాలీసెట్ ఫలితాల్లో ఖమ్మం విద్యార్థినికి

స్టేట్ ఫస్ట్ ర్యాంక్



లాస్యశ్రీ

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 24 (ఆంధ్రజ్యోతి): పాలీసెట్ కామన్ ఎంట్రన్స్ పరీక్షా పలితాల్లో ఖమ్మం నగరానికి చెందిన తూమాటి లాస్యశ్రీ 150 మార్కులకు గాను 150మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఖమ్మం నగరంలోని అభయ వెంకటేశ్వరనగర్‌కు చెందిన లాస్యశ్రీ తల్లిదండ్రులు తూమాటి సైదాబాబు, సుజాతలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. లాస్యశ్రీ పదోతరగతి నగరంలోని న్యూవిజన్ పాఠశాల్లో చదివి వార్షిక పరీక్షల్లో 569 మార్కులు సాధించింది.

ఐపీఎస్ లక్ష్యంగా..

ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ తీసుకొని ఐఐటీ సీటు సాధించి ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యమని పాలీసెట్ ర్యాంకర్ లాస్యశ్రీ తెలిపింది. పాలీసెట్‌లో 150 మార్కులు రావటం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, తల్లిదండ్రుల, పాఠశాల యాజమాన్యం సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు.

రాజ్యాంగానికి బీజేపీతోనే ప్రమాదం

- ఎంతమంది నక్సలైట్లను చంపినా సిద్ధాంతాన్ని చంపలేరు
- అడవులను కార్పొరేట్లకు అప్పజెప్పేందుకే మావోయిస్టు బూచి
- ప్రజా ఉద్యమ నిర్మాణం కోసం పరితపించిన వ్యక్తి గిరిప్రసాద్
- వర్ధంతి సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- మావోయిస్టుల చర్చలపై ఎందుకు స్పందించడంలేదు : కూనంనేని



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ఖమ్మం, మే 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగానికి బీజేపీతోనే ప్రమాదం ఉందని, పాకిస్థాన్‌ను మోకాళ్లపై నిలబెట్టామంటున్న మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముందు మోకరిల్లుతున్నాడని సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ విమర్శించారు. ఖమ్మంలోని రిక్కాబజార్ ప్రభుత్వ పాఠశాల మైదానంలో శనివారం జరిగిన సాయుధ పోరాట యోధుడు నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి సభలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలో ఉన్న గిరిప్రసాద్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ నల్లమల గిరిప్రసాద్ క్రమశిక్షణ, నిబద్ధతలకు మారుపేరుగా నిలిచారన్నారు. ఆయన తన తుదిశ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాఉద్యమ నిర్మాణం కోసం పరితపించారన్నారు. ఒకవైపు ట్రంప్ అంతర్జాతీయంగా ఆర్థిక ఆంక్షలు పెడుతుంటే కేంద్రంలోని బీజేపీ పాలకులు ఎంతో గుర్తింపు ఉన్న భారతదేశాన్ని తీసుకెళ్లి ఆయన ముందు మోకరిల్లేలా చేస్తున్నారన్నారు. రాజకీయ చరిత్రలో అమిత్‌షా వంటి పెద్ద క్రిమినల్ హోం మినిస్టర్ కావడం అనేది చాలా అవమానకరమన్నారు. దేశంలో రాజ్యాంగానికి కమ్యూనిస్టుల వల్లనో, నక్సలైట్ల వల్లనో ప్రమాదం లేదని, స్వయంగా ప్రజలు ఎన్నుకున్న మోదీ, అమిత్‌షా లాంటి వారి వల్లనే ప్రమాదం ఉందన్నారు.

నక్సలైట్ సిద్ధాంతాన్ని చంపలేరు

2026 వరకు నక్సలైట్లను లేకుండా చేస్తామంటున్నవారు మనుషులను చంపొచ్చేమో కానీ వారు నమ్మిన సిద్ధాంతాలను మాత్రం లేకుండా చేయలేరన్నారు. ఎంతమంది నక్సలైట్లను చంపినా ఉద్యమం ఆగదన్నారు. నక్సలిజాన్ని రూపుమాపుతామంటున్న బీజేపీ ప్రభుత్వం టెర్రరిస్టులను ఏం చేస్తోందని ప్రశ్నించారు. నక్సలైట్లు శాంతి చర్చలకు సిద్ధమని చెప్పినా వారితో చర్చించడానికి సిద్ధంగా లేరు.. కానీ టెర్రరిస్టులతో రాజీ పడుతున్నారన్నారు. మొత్తం అడవి ప్రాంతంలో ఉన్న గిరిజనులను చంపేస్తే అడవులు ఖాళీ అవుతాయనీ, అప్పుడు అదానీ, అంబానీల వంటి కార్పొరేట్ పులులు అక్కడ చేరతాయన్నారు. కులగణన కచ్చితంగా (మిగతా 6వ పేజీలో)

రామక్షేత్రం అభివృద్ధికి వడివడిగా అడుగులు

- భూసేకరణ చెల్లింపులతో ఖాళీ అవుతున్న ఇళ్లు
- భద్రాద్రి రామాలయ అభివృద్ధి పనుల్లో పురోగతి



రామాలయ అభివృద్ధి పనులు చేపట్టనున్న ప్రాంతం

భద్రాచలం, మే 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ పరిసరాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించి నిధులు విడుదల చేసింది. ఈ క్రమంలో ఇప్పటికే అత్యధిక శాతం మంది భూ సేకరణ చట్టం కింద పరిహారం స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఇళ్లను ఖాళీ చేయాలని అధికారులు ఇచ్చిన గడువు ముగియడంతో ఇళ్లను ఖాళీ చేస్తున్నారు. కాగా ప్రభుత్వం ఇచ్చే పరిహారం తమకు మరింతగా చెల్లించాలని కోరుతున్న కొంత మంది ఇంటి యజమానులు ఇప్పటి వరకు పరిహారం స్వీకరించేందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో కోర్టును సైతం ఆశ్రయించినట్లు సమాచారం. ఇప్పటికే పరిహారం స్వీకరించిన ఇంటి యజమానులు ఖాళీ చేసేందుకు సన్నద్ధమవుతున్న క్రమంలో ఇళ్లను తొలగించే ప్రక్రియను ప్రారంభిస్తామని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

ఇంకా అస్పష్టతే!

భద్రాద్రి రామాలయ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం స్థలాన్ని సేకరించాలని నిర్ణయించగా 40 కుటుంబాలకు పరిహారంగా చెల్లించేందుకు రూ.34,45,86,000 ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో 31 కుటుంబాలకు ఇప్పటికే పరిహారం చెల్లించినట్లు రెవెన్యూ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మిగిలిన కుటుంబాలు పరిహారం మరింతగా ఉండాలని ఆశిస్తున్న క్రమంలో వారు ఇప్పటి వరకు పరిహారం స్వీకరించేందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. ఆలయ అభివృద్ధి కోసం రామ భక్తులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సీఎం ఎ.రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులను రూ.60.20 కోట్లు మంజూరు చేస్తూ 2024 సెప్టెంబరు 13న జీవో జారీ చేసింది. ఆ మొత్తాన్ని అభివృద్ధి పనుల కోసం కేటాయించారు. ఈ క్రమంలో ఆలయ అభివృద్ధి కోసం దక్షిణం వైపు తొలగించనున్న ఇళ్లకు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపారు. ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను ఆమోదించగా రామాలయ అభివృద్ధి పనుల్లో భూ సేకరణ కోసం సుమారు రూ.35 కోట్లు విడుదల చేసింది.

149 మంది కానిస్టేబుళ్లు బదిలీ

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలువురు సివిల్ కానిస్టేబుల్స్‌ను బదిలీ చేస్తూ శనివారం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఉత్తర్వులు జారీచేశారు. వివిధ పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న 149 మంది కానిస్టేబుల్స్‌ను బదిలీ చేస్తూ, వారిని కేటాయించిన స్టేషన్లలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

జాబ్‌మేళాకు అపూర్వ స్పందన



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- పండుగను తలపించిన నమోదు ప్రాంగణం
- వేలాదిగా తరలివచ్చిన అభ్యర్థులు

వైరా, మే24 (ఆంధ్రజ్యోతి): వైరాలో శనివారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చొరవతో సింగరేణి కాలరీస్ సహకారంతో నిర్వహించిన మేగా జాబ్‌మేళాకు అనూహ్యస్పందన లభించింది. వేలాది మంది నిరుద్యోగులు తరలివచ్చారు. దాంతో వైరాలోని రోడ్లు, జాబ్ మేళా జరిగిన ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కాలేజీ ఆవరణాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని కొన్ని మండలాల నుంచి నిరుద్యోగులు వైరా రావటానికి ప్రత్యేకంగా ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. ఈ జాబ్‌మేళాకు 8,350 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నారని ఆఫ్‌లైన్‌లో 1500 మందికి పైగా పేర్లు నమోదు చేసుకున్నారని హెచ్‌ఆర్ చందర్ తెలిపారు. 80 కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొన్నాయి. జాబ్‌మేళాను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. సింగరేణి కాలరీస్ అధికారులు, నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, వైరా మునిసిపల్ కమిషనర్, ఇతర శాఖల అధికారులు, అధికార కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వాటర్‌బాటిల్స్, మజ్జిగ పంపిణీ చేశారు. జాబ్‌మేళాకు వచ్చిన వేలాది మందికి భోజనాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కార్పొరేషన్ చైర్మన్‌లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, పీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, సింగరేణి జనరల్ మేనేజర్ శాలోమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మరిచిపోలేని అనుభూతి: ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో సింగరేణికాలరీస్ సహకారంతో వైరాలో మెగా జాబ్ మేళా నిర్వహించడం తనకు మరిచిపోలేని అనుభూతని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వేలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే అవకాశం లభించిందన్నారు. వైరా రిజర్వాయర్‌కు జూన్‌లో రాజీవ్‌లింక్‌కెనాల్ ద్వారా సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు తీసుకొచ్చి జూలైలోనే నాట్లు వేయిస్తామని ప్రకటించారు.

14చోట్ల జాబ్‌మేళాలు: సీఎండీ బలరాం



సింగరేణి విస్తరించి ఉన్న ప్రాంతాల్లో 14 చోట్ల మెగా జాబ్‌మేళాలను నిర్వహిస్తామని సింగరేణి సీఎండి బలరాం తెలిపారు. రాష్ట్రానికే పరిమితం అయిన సింగరేణిని దేశంలోనే ఇతర రాష్ట్రాలకు విస్తరించి రాష్ట్ర సంపదను జాతీయ సంపదగా మారుస్తున్నామని పేర్కొన్నారు. ఒడిసాలో కోల్‌మైన్ సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఒప్పందాలు జరిగాయని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా 150 కిలోమీటర్‌ల దూరం రోడ్డు మార్గంలో ప్రయాణించి కోల్‌మైనను పరిశీలించి ఒప్పందాలు ఖరారు చేశారని వివరించారు. మెగా జాబ్‌మేళాకే పరిమితం కాకుండా సింగరేణి అధికారులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తరచూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.



జాబ్‌మేళాకు వచ్చిన అభ్యర్థులు

జాతీయవాదులపై కేసులు సరికాదు

- దాడిని ముగ్గురు మంత్రులు ఖండించకపోవడం బాధాకరం
- నేడు మహిళల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తాం
- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్, మే 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 19వ తేదీన జరిగిన తిరంగా ర్యాలీ సందర్భంగా పోలీసులు జాతీయవాదులపై కేసులు నమోదు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని ఒక హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో జరిగిన ఘటన అనుమానంగా ఉందని, దాడిలో ఒక వర్గం చేసిన కుట్ర దాగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దాడి ఘటనకు సంబంధించి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా జాతీయవాదులపై జరిగిన దాడిని ఖండించకపోవడం బాధాకరమని అన్నారు. తిరంగా ర్యాలీలో దుండగులు దాడి చేశారని ఒక జాతీయవాది సోషల్ మీడియాలో పోస్టు చేస్తే ఆవ్యక్తిపై కేసు నమోదు చేసి, దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయక పోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ తిరంగా ర్యాలీ సందర్భంగా జరిగిన ఘటన ఆధారంగా పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ జరిగిన ఘటనపై రాష్ట్ర నాయకత్వం నలుగురు సభ్యులతో కూడిన ఒక కమిటీని నియమించిందని తెలిపారు. ఆదివారం నగరంలో మహిళల ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలకు ప్రభాత్ టాకీస్ నుంచి పాత బస్టాండ్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు సన్నె ఉదయ్ ప్రతాప్, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, దళిత మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, రమేష్ యాదవ్, అల్లిక అంజయ్య, పుల్లారావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

ములకలపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై బాలుడు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని వీకే రామవరం గ్రామానికి చెందిన కొర్సా అరవింద్(13) రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం స్నానం చేసిన అనంతరం దండెంపై దుస్తులు ఆరవేశాడు. అయితే ఆ ఇనుమ వైరుకు విద్యుత్ సరఫరా జరగడంతో షాక్ తగిలి మృతిచెందాడు. చిన్న వయస్సులోనే తండ్రి మృతి చెందడంతో తల్లి పద్మ అన్ని తానే అయి ఆ కుటుంబాన్ని పోషించుకుంటు వచ్చింది. కొడుకు చేతికి వచ్చే సమయంలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందడంతో ఆ తల్లి రోదిస్తున్న తీరు చూపరులను కంటతడిపెట్టించింది. తల్లి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య

కల్లూరు, మే24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లయ్య బంజర గ్రామంలో బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థిని మనస్తాపానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పుల్లయ్యబంజరు గ్రామానికి చెందిన వాసంశెట్టి ప్రవల్లిక(19) బీటెక్ చదువుతోంది. తనకు వివాహం చేస్తారేమోనని, మధ్యలో చదువు ఆగిపోతుందని మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో శుక్రవారం మధ్యాహ్నం ఉరివేసుకొని ప్రవల్లిక ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు తండ్రి రంగారావు ఇచ్చిన ఫిర్యాదుతో కల్లూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు నెలలకు ఒకేసారి రేషన్

- లబ్ధిదారులకు బియ్యం పంపిణీకి నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఖమ్మం కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులకు ప్రభుత్వం మూడు నెలలకు సరిపడా సన్నబియ్యాన్ని ఒకేసారి అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే జిలా పౌరసరఫరాల అధికారులు మూడు నెలల రేషన్ బియ్యం సరఫరాకు సన్నాహాలు చేశారు. గత పదిరోజులుగా వీడియోకాన్ఫరెన్స్‌లో మౌఖిక ఆదేశాలు జారీ చేయడంతో వాటి ఏర్పాట్లను చకాచకా చేశారు. శనివారం పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేయడంతో రేషన్‌డీలర్లు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. రాబోయే మూడు నెలలకు (జూన్, జూలై, ఆగస్టు) సంబంధించిన బియ్యం కోటా జూన్‌లోనే పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వర్షాల నేపథ్యంలో వాగులు వంకలు దాటాల్సి వస్తుండటంతో లబ్ధిదారులకు ఇబ్బంది కలగవద్దనే ఉద్దేశ్యంతో సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

748 రేషన్ దుకాణాలు..

ఖమ్మం జిల్లాలో 748 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 4,11,202 తెల్ల, 27268 అంత్యోదయ, 3 అన్నపూర్ణ కార్డుదారులు ఉన్నారు. ఈ కార్డుల ద్వారా ప్రతి నెల 7,618.457 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇలా మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని డీలర్లకు పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు మూడు నెలలకు ఒకేసారి బియ్యాన్ని అందించడానికి కూడా ఎలాంటి లోటు లేదని చెబుతున్నారు. అయితే రేషన్ దుకాణాలకు ఒక నెల సరుకులు దింపుకోవడానికే సరైన స్థలం లేకపోవడంతో ఒకేసారి మూడునెలలకు బియ్యాన్ని దిగుమతి చేసుకోవాలంటే ఆ షాపులు సరిపోయే పరిస్థితి లేదు. దీంతో దీనికి ప్రత్యామ్నాయంగా డీలర్లు ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం.

అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, మే 24 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజాపాలన సాగుతున్నట్లు రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో శనివారం పర్యటించిన మంత్రి రూ.28 కోట్లతో పోచారం పోచారం నుంచి తాళ్లచెరువు, కిష్టాపురం జడ్పీరోడ్డు వరకు బీటీ రహదారి పనులను ప్రారంభించారు. జీళ్లచెరువు గ్రామంలో రూ.50లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ, డ్రైనేజ్ నిర్మాణాల పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బాగు చేసుకుంటూనే ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామం, మండలంలో పథకాలు అమలుచేస్తునే, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మొదటివిడతలో రాలేదని ఎవ్వరూ అధైర్యపడవద్దని, మిగిలిన విడతల్లో అందరికీ ఇల్లు వచ్చేలా చూస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణంలో ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగడానికి వీలులేదని మంత్రి స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు రాజీవ్ యువవికాసం పథకం ద్వారా యూనిట్లు మంజూరీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్‌ఈ వెంకటరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ యాఖుబ్, తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

698 కేజీల గంజాయి సీజ్

(5వ పేజీ తరువాయి)

సుమారు రూ.3.49కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. వ్యాన్‌లో ఉన్న ముగ్గురు వ్యక్తులను, కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన వ్యాన్, కారుతో పాటు ఐదు మొబైల్ ఫోన్లను కూడా సీజ్ చేశారు. ఈ గంజాయిని ఏపీలోని సీలేరు అటవీ ప్రాంతం నుంచి హర్యానాలోని కురుక్షేత్రం ప్రాంతానికి రవాణా చేస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ నిందితులంతా కురుక్షేత్ర జిల్లాకు చెందిన ప్రిన్స్‌కుమార్ ఆధ్వర్యంలో పార్శిల్ సర్వీసు మాటున గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డారు.

పట్టుబడిన ఆరుగురు ..

గంజాయి రవాణా చేస్తూ పట్టుబడినవారిలో హర్యానాలోని కురుక్షేత్ర జిల్లాకు చెందిన సందీప్‌కుమార్ అలియాస్ రింకు, లక్విందర్, అమరనాథ్‌కుమార్ అలియాస్ అమర్‌నాథ్, పవన్‌కుమార్, రాజ్‌కుమార్ అలియాస్ వినోద్, కృష్ణన్‌కుమార్ అలియాస్ కాలే ఉన్నారు. హర్యానాకు చెందిన హరిఖరా, ప్రిన్స్‌కుమార్‌పై కూడా కేసులు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు. చాకచక్యంగా గంజాయిని పట్టుకున్న టేకులపల్లి సీఐ టి. సురేష్, ఎస్‌ఐ ఎ.రాజేందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, ఎస్‌ఐలు ప్రవీణ్, రామారావు, పోలీసు సిబ్బందిని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ప్రత్యేకంగా అభినందించారు.

రాజ్యాంగానికి బీజేపీతోనే ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

జరగాలన్నారు. కానీ దానికి కాలపరిమితి పెట్టాలన్నారు. చట్టసభల్లో బీసీలు పోటీ చేసేలా రాజ్యాంగ సవరణ జరగాలన్నారు. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన రూ.16.5 లక్షల కోట్ల సొమ్మును రుణంగా తీసుకొని ఎగ్గొట్టిన 29మందిలో 28 మంది గుజరాత్ గుండాలేనన్నారు. వారిమీద కానీ, వారి ఆస్తుల మీద ఎలాంటి యాక్షన్ ఎందుకు తీసుకోలేదని నారాయణ ప్రశ్నించారు. దేశంలో నియంత పాలన కొనసాగించాలని చూస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వామపక్ష లౌకికశక్తుల ప్రత్యామ్నాయం మాత్రమే దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతలను కాపాడగలదన్నారు. నక్సలైట్లను జనజీవన స్రవంతిలో కలవాలనీ, పోరాటం కొనసాగిద్దామన్నారు. రాక్షస ప్రభుత్వాన్ని అంతంచేద్దామని పిలుపునిచ్చారు.

చర్చలపై ఎందుకు స్పందిచడంలేదు: కూనంనేని

మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమంటే ఎందుకు స్పందించడంలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ప్రశ్నించే వారిని బీజేపీ ప్రభుత్వం హరిస్తుందన్నారు. నాడు నిజాం ప్రభుత్వ పంథానే నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. నేరస్థులు, ఆర్థిక అరాచకవాదులు సమాజంలో పెద్ద మనుషులుగా చలామణి అవుతుంటే ప్రశ్నించే వారు ఏదో ఒక రూపంలో చంపబడటమో లేక జైళ్లలోకి వెళ్లడమో జరుగుతోందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సైతం మావోయిస్టులతో చర్చలు జరిపేది లేదంటున్నారనీ, పనిచేయాలనుకున్న ఆలోచనను, సిద్ధాంతాన్ని చంపేయడం ఎవరితరం కాదన్నారు. దేశంలోనే అతిపెద్ద క్రిమినల్‌గా చెప్పుకునే అమిత్‌షా ప్రజాస్వామ్యం గురించి, రాజ్యాంగ భద్రత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. దేశ శత్రువులతో పోరాటం సాగించలేని, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను దేశంలో విలీనం చేయలేని మోదీ తన సైన్యంతో ఆదివాసీలపై అంతర్గత యుద్ధం చేస్తున్నారని ఆరోపించారు. గిరిప్రసాద్‌లాంటి ఎంతోమంది పోరాటయోధుల వారసత్వంతో ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సభలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే షాబీర్‌పాషా మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్‌కే జానీమియా, రాష్ట్ర సమితీ సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, గిరిప్రసాద్ తనయుడు నల్లమల చక్రవర్తి, నాయకులు మిరియాల రంగయ్య, యర్రబాబు, శింగు నరసింహారవు, బీజీ క్లైమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో మైనింగ్ అధికారుల బదిలీలు

(5వ పేజీ తరువాయి)

బదిలీ చేశారు. రామగుండం-3లో డీవైజీఎంగా పని చేస్తున్న మాధవరావును ఒడిశాలోని నైనీ ప్రాజెక్టుకు, భూపాలపల్లి కేటీకే-2 ఓపెన్‌కాస్టులో డీవైజీఎంగా పని చేస్తున్న కృష్ణప్రసాద్‌ను బెల్లంపల్లి ఏరియాకు, శ్రీరాంపూర్-1 ఇంక్లైన్‌లో పని చేస్తున్న విజయ్‌కుమార్‌ను ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీరాంపూర్‌కు, భూపాలపల్లిలోని కేటీకే ఓసీ-3లో డీవైజీఎంగా పని చేస్తున్న సీఆర్‌టీ. ప్రసాద్‌రావును రామగుండం ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌గా, కేటీకే భూపాలపల్లి ఓసీ3లో పని చేస్తున్న డీవైజీఎం ఎరుక శ్రీనివాస్‌ను కేటీకే-3 ప్రాజెక్టు మేనేజరుగా, భూపాలపల్లి కేటీకే-5 ఇంక్లైన్‌లో పని చేస్తున్న డీవైజీఎం జాకీర్ హుస్సేన్‌ను ఇల్లెందు ఏరియా సేఫ్టీ అధికారిగా, మణుగూరు పీకే ఓసీలో పని చేస్తున్న సూపరింటెండెంట్ కళ్యాణ్‌ను జేవీఆర్ ఓసీ మేనేజరుగా, జేవీఆర్ ఓసీ మేనేజరుగా పని చేస్తున్న దుర్గా ప్రసాద్‌ను కేటీకే ఓసీ-2 మేనేజరుగా బదిలీ చేస్తూ యాజమాన్యం ఉత్తర్వులను జారీ చేసింది.

నిరుద్యోగ నిర్మూలనకు మూడంచెల విధానం

(5వ పేజీ తరువాయి)

సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వరంగ సంస్థల ద్వారా జాబ్ మేళాలను నిర్వహించి అర్హులైన వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. మరోవైపు రూ.9కోట్లతో రాజీవ్ యువవికాసం ద్వారా అర్హులైన నిరుద్యోగులకు ఉపాధి కోసం రుణాలు ఇస్తున్నామని తెలిపారు. జూన్ 2వ తేదీన రుణమంజూరు పత్రాలు అందజేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ప్రతి నిరుద్యోగి తెలంగాణ బిడ్డేనని వారు భవిష్యత్తుకై ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం, కార్పొరేషన్ చైర్మన్‌లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. పీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్రమార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతగాని జయపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, స్వర్ణ నరేందర్, మంగీలాల్, ప్రకాశ్, నాయకులు బానోతు విజయాబాయి, ఏదునూరి సీతరాములు, ధార్నా రాజశేఖర్, దొబ్బల సౌజన్య, కృష్ణప్రసాద్, కనకదుర్గ, పణితి శ్రీను పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న లారీ పట్టివేత

అశ్వాపురం, మే24(ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని శనివారం అశ్వాపురం పోలీసులు పట్టుకున్నారు. చర్లనుంచి హైదరాబాద్‌కు అక్రమంగా పశువులను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు అశ్వాపురం ఎస్‌ఐ మధుప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఏర్పాటుచేసి గొల్లగూడెం సీతారామా కెనాల్ బ్రిడ్జి వద్ద లారీని అదుపులోకి తీసుకున్నారు. గతంలో పశువుల అక్రమరవాణాకు పాల్పడిన మోహిజ్ అనేవ్యక్తితోపాటు మరోముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా అక్రమంగా తరలిస్తున్న 35పశువులను స్వాధీనపర్చుకుని గోశాలకు తరలించారు. కాగా ఎస్పీ రోహిత్‌రాజ్ ఆదేశాల మేరకు మణుగూరు ఎస్డీపీవో వంగా రవీందర్‌రెడ్డి గోవుల రవాణాను అడ్డుకోవాలని నిఘాఏర్పాటు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు





జీపీఓ పరీక్ష కేంద్రం వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలు

ఖమ్మంఖానాపురంహవేలిమే24(ఆంధ్రజ్యోతి):మే25న(ఆదివారం) నిర్వహించనున్న గ్రామ పాలన అధికారుల నియామక పరీక్ష కేంద్రం వద్ద 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ అమలులో ఉంటుందని పోలీస్ కమిసనర్ సునిల్ దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని స్వర్ణభారతీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2:30 వరకు యాక్ట్ అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రానికి 200 వందల మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ రహదారులతో అభివృద్ధికి బాటలు

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కూసుమంచి,మే24 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల విస్తరణ ద్వారా అభివృద్ధికి బాటలు పడుతాయని వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కూసుమంచిలో శనివారం ప్రముఖ వ్యాపారి, ఆర్య వైశ్యసంఘ నాయకుడు బోనగిరి ఆంజనేయులును పరామర్శించారు. ఆయన కుమారులు ఆర్యవైశ్యసంఘం నాయకులు రాజేంద్రప్రసాద్, సీనియర్ జర్నలిస్టు లక్ష్మీనర్సింహారావును పరామర్శించారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారి నిర్మాణం పూర్తికావడంతో ఈప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. ఈహైవే ఏర్పాటుతో ఉత్తర దక్షిణాది ప్రాంతాలు అనుసంధానం అవుతాయన్నారు. హైవేల నిర్మాణంగా కారణంగా ఖమ్మంజిల్లా ఆర్థికంగా, సామాజికంగా మరింత అభివృద్ధికి బాటలు పడతాయన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం ద్వారా పారిశ్రామికాభివృ, రోడ్డుప్రమాదాల నివారణ, ప్రయాణ ఆలస్యం ఆదా, వాహనాల క్షేమం, తక్కువ సమయంలో సురక్షితంగా గమ్యానికి చేరుకోవచ్చని తెలిపారు. రవాణా సదుపాయం, సమాచార వ్యవస్థ ఉంటే ఆప్రాంతం శరవేగంగా అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న రహదారులన్నీ పూర్తయ్యేలా కృషి చేస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి వెంట నాయకులు రామ శ్రీను, హఫీజుద్దీన్, సేట్‌రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆంజనేయులు కుటుంబాన్ని పరామర్శించారు. జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి పరామర్శించారు.


నివాళి అర్పిస్తున్న మంత్రి తుమ్మల

పాలేరును మరో కోనసీమగా మారుస్తా

» బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం లూటీ
» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం, మే24(ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గాన్ని మరో కోనసీమగా తీర్చిదిద్దుతానని రెవెన్యూ, సమాచారశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పాలేరు నియోజకవర్గానికి కృష్ణా, గోదావరి జలాలతో పాటు వృథాగాపోతున్న వర్షపునీటిని పాలేరు రిజర్వాయర్‌కు మళ్లిస్తామన్నారు. ఈప్రాంతంలోశాశ్వత సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఇందు కోసం ప్రభుత్వం రూ.162కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. మండలంలోని రాకాసితండానుంచి మన్నెగూడెం వరకు బీటీ రోడ్డు పనులకు, పాతర్లపాడు నుంచి రావిచెట్టుతండా వరకు బీటీ రోడ్ల పనులకు, మహ్మదాపురంలో బోడతండానుంచి సుబ్లేడు, మేడిదపల్లి రోడ్డు నుంచి భవాని అమ్మగుడి వరకు బీటీరోడ్డు, తెట్టెలపాడు గ్రామంలో ఏడు సీసీ రోడ్లు, గోపాలపురంనుంచి జల్లేపల్లి వరకు డబుల్‌లైన్ రహదారికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగినసభల్లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ దివాళా తీయించిందన్నారు. ప్రతీ గ్రామంలో సాగు, తాగునీటితోపాటు విద్యా , వైద్యం, రహదారుల కల్పనకు నిధులు మంజూరుచేసి పాలేరును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ వెంకటరెడ్డి, ఆర్అండ్‌బీఎస్ఈ యాకుబ్, హౌజింగ్‌పీడీ భూక్యాశ్రీనివాస్, ఆర్డీవో నరసింహారావు, ఏడీఏ సరిత, జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి చావా శివరామకృష్ణ, పంచాయతీరాజ్ ఛాంబర్ గౌరవ అధ్యక్షులుపుసులూరి నరేందర్, సుడిగాలి కిషన్‌రావు,మాజీ జడ్పటీసీ బెల్లం శ్రీను, ఏవో సీతారాంరెడ్డి తహసీల్దార్ లూథర్ విల్సన్, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఏఎంసీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంగీలాల్, జడల నగేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పొంగులేటి

కార్యకర్తలకు అండగా ఉంటా

ఎంపీ రామసహాయం రఘురామ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఖమ్మం ఎంపీ

నేలకొండపల్లి,మే24(ఆంధ్రజ్యోతి):కార్యకర్తలకు అండగా ఉంటానని ఎంపీ రామసహాయం రఘురామ్‌రెడ్డి చెప్పారు. శనివారం నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీ పర్యటించారు. తొలుత బుద్దారంలో ఆరెకట్ల గురునాథం అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సామావేశంలో పాల్గొన్నారు. కార్యకర్తల సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని, ఎల్లవేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. చెర్వుమాధారంలో జరిగిన కార్యక్రమంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. నేలకొండపల్లి రైతువేదికలో జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో 80 శాతం సీసీరోడ్లు పూర్తిచేసామన్నారు.అనంతరం 14మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎంపీ అందించారు. కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, శాఖమూరి రమేష్, బొడ్డు బొందయ్య, ఆరెకట్ల గురవయ్య, కుక్కల హనుమంతరావు, వెన్నపూసల సీతారాములు, ధరావత్ బాలాజి, తేజావత్ శివాజి, రాయపూడి నవీన్, మామిడి వెంకన్న, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మర్రి ఎర్రయ్య, మండల వ్యవసాయాధికారి యం.రాధ తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం సందర్శన

ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియాన్ని శనివారం ఎంపీ రామసహాయం రాఘురామిరెడ్డి సందర్శించారు. స్టేడియం ఆవరణలో తిరుగుతూ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సూచనలు చేశారు. పలువురు క్రీడాకారులతో ముచ్చటించారు.సమస్యలు, క్రీడాభివృద్ధికి కావాల్సిన సమాచారాన్ని సేకరించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్ ఉన్నారు.

28న గ్రానైట్ ఫ్యాక్టరీ టైల్స్ యజమానుల సంఘం కమిటీ ప్రమాణస్వీకారం

ఖమ్మంఖానాపురంహవేలి, మే24(ఆంధ్రజ్యోతి): దిఖమ్మంగ్రానైట్ ఫ్యాక్టరీ టైల్స్ యజమానుల సంఘం కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం ఈనెల28న అంకమ్మ తల్లిగుడి వద్ద గల టైల్స్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రమాణస్వీకారం ఉంటుందని సభ్యులు తెలిపారు. ఎన్నికల అధికారి బుగ్గవీటి. శ్రీధర్ ప్రమాణ స్వీకారం చేయించి ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాలను అందించనున్నారు. ఈ కమిటీ సభ్యుల కాలపరిమితి 2025-27 సంవత్సరం వరకు ఉంటుందని ఎన్నికల అధికారి తెలిపారు.

ప్రమాణస్వీకారం చేయనున్న సభ్యుల వివరాలు

అద్యక్షుడిగా తెడ్డు. రమేష్, ఉపాధ్యక్షుడు1గా బోయిడి. వెంకటరమణ, ఉపాధ్యక్షుడు2గా బోరెం. నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మోతుకూరి. రామ భద్రయ్య, సంయుక్త కార్యదర్శి1గా పోలూరి. కృష్ణ, సంయుక్త కార్యదర్శి2గా చాగంటి. సందీప్, కోశాధికారిగా చాగంటి. శ్రీకాంత్, ఈసీ నెంబర్‌గా వీరెల్లి. సీతారామయ్యలచే ఎన్నికల అధికారి ప్రమాణస్వీకారం చేయించనున్నారు.

గ్రామపాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్

ఖమ్మంకలెక్టరేట్,మే24(ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. శనివారం సీసీఎల్ఏ కమిషనర్, హైదరాబాద్ నుంచి గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ నేటి ఉదయం10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జిల్లాలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జూన్3 నుంచి అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల నుంచి భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించాలని సీసీఎల్ఏ అన్నారు.

మీ అభిమానమే ఈ స్థాయిలో ఉంచింది

» కష్టం ఎప్పటికైనా రుణం తీర్చుకుంటుంది
» అభినందన సభలో ఆర్టీఐ కమిషనర్ శ్రీనివాస్

ఖమ్మంకలెక్టరేట్, మే24(ఆంధ్రజ్యోతి): 'విద్యార్థి దశ నుంచి అనేక ప్రగతిశీల ఉద్యమాలు, జీవితంలో ఆటుపోట్లు, తెలంగాణ ఉద్యమంలో ఒక జర్నలిస్టుగా పడ్డ కష్టం నాకు మీరంతా చూపించిన అభిమానం నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చింది. కష్టం ఎప్పటికైనా రుణం తీర్చుకుంటుంది..' అని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పీవీ శ్రీనివాస్ అన్నారు. తన జీవితంలో అనుభవించిన ఆటుపోట్లను గుర్తు తెచ్చుకుని భావోద్వేగంతో ప్రసంగించారు. ఖమ్మంలో ఐఎంఏ హాల్లో శ్రీనివాస్‌కు శనివారం అభినందన, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పీవీ మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వాహకులుగా డాక్టర్ జీవీ, బిచ్చాల తిరుమలరావు, ఆకుతోట ఆదినారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మిత్ర బృందం ఏర్పాటుచేసిన అభినందన సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేను జీవితంలో పడ్డ కష్టానికి నాకు ఈ పదవి దక్కిందన్నారు. మిత్రులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. కానీ నాతో భౌతికంగా విడిపోయిన వ్యక్తులు ఈరోజు ఉండుంటే నాకంటే ఎక్కువ సంతోష పడేవారు అని అభిప్రాయపడ్డారు. నూకల నరేష్ రెడ్డి, మా అమ్మ, బుడాన్ బేగ్‌ను గుర్తు చేసుకొని భావోద్వేగానికి గుయ్యారు. పీవీ శ్రీనివాస్ సహచరిణి సృజన మాట్లాడుతూ ఉద్యమం ద్వారా జీవితంలో పడ్డకష్టాన్ని గుర్తు చేసుకున్నారు. ఖమ్మం ఆడబిడ్డని అంటూ ప్రతీ ఒక్కరిని గుర్తు చేసుకున్నారు. ఉద్యమ సమయంలో తినడానికి తిండి లేని రోజులను గుర్తుచేశారు. 'ఆ చల్లని సముద్ర గర్భం' అంటూ ఉద్యమ సమయంలోని పాటను పాడి తన ఉద్యమ రూపాన్ని గుర్తు చేశారు. పరకాల విజయ్ పీవీ శ్రీనివాస్‌పై పాడిన పాట ఆహూతులను అలరించింది. పమ్మి రవి కళాకారుల బృందం తెలంగాణ పాటలతో ఉర్రూతలూగించారు. పీవీ శ్రీనివాస్ మిత్రులు, అభిమానులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని శాలువాలు, పూలమాలతో పీవీ శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.


శ్రీనివాస్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

పాలీసెట్‌లో న్యూవిజన్ విద్యార్థుల ప్రతిభ



ఖమ్మంఖానాపురంహవేలి, మే24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంకేతిక విద్యాశిక్షణ మండల నిర్వహించిన పాలీసెట్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాల్లో న్యూవిజన్ పాఠశాల విద్యార్థులు తూమాటి. లాస్యశ్రీ స్టేట్ మొదటి ర్యాంక్, కోట. సాత్విక స్టేట్ 19వ ర్యాంక్ సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ షైఖేల్ తెలిపారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, హార్టీకల్చర్, వెటర్నరీ డిప్లమా కోర్సుల్లో సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఫలితాల్లో న్యూవిజన్ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థులను విద్యాసంస్థల ఛైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, అభినందించారు.

త్రివేణి విద్యార్థుల విజయకేతనం



ఉత్తమ ర్యాంకులు సాధించిన త్రివేణి విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి,మే24(ఆంధ్రజ్యోతి): పాలీసెట్ ఫలితాల్లో నగరంలోని త్రివేణి పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి. వీరేంద్రచౌదరి, త్రివేణి, కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ. వెంకటేశ్వరరావు తెలిపారు. పాఠశాలకు చెందిన సరయు 109, ప్రణవి 106, వెంకట వర్షిత్ 107, చరిత 103, శాహిస్త 99 ర్యాంకులు సాధించారని చెప్పారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

బీఆర్క్, బీ ప్లానింగ్ ఫలితాల్లో హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

ఖమ్మంఖానాపురంహవేలి,మే24(ఆంధ్రజ్యోతి): శుక్రవారం విడుదల చేసిన బీఆర్క్, బీప్లానింగ్ ఫలితాల్లో నగరంలోని హార్వెస్ట్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా టాప్ ర్యాంకులు సాధించారని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవి మూరుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన వివిధ క్యాటగిరిల్లో ఎన్‌సీహెచ్. జస్వంత్‌సాయి 38వ ర్యాంక్, బి. సాయిచరణ్ 50, ఎం.బి. సంజయ్ 86, ఎం.నాగయశ్వంత్ 117, వై. సాయినేహ 128, బి. ప్రణీత 141, మేముల. సాయిదీపిక 206, పి. క్రిష్ సాత్విక్ 225, వి. శరణ్‌గోపాల్ స్వామి 253, ఎస్. రాఘవేంద్ర నవనీత్ 302, కందుల. రోహిత్ 346, కమతం. విన్య 363 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మంఖానాపురంహవేలి, మే24(ఆంధ్రజ్యోతి):బీఆర్క్,బీ ప్లానింగ్ ఫలితాల్లో నగరంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారని విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి, శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. కళాశాలకు చెందిన పి.సాయికుమార్ 55, ఏ. గోవర్ధన్ 129, వి.ప్రణతి 210, ఎం.ప్రహలాద్ 275, బి.వంశీ 292, వి.కుశాల్ 339, డి.అరుణ్ 368, టి.హనుమంత్ సాయి 493, పి.సాయిప్రకాష్ 570, బి.బాలాజీ 594, ఎస్‌కే. అబ్దుల్ అనాస్ 620, జె.కౌశిక్ వర్మ 710, ఐ.అను 712 తోపాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు.

పాలీసెట్‌లో సత్తా చాటిన పవన్‌కుమార్

17వ ర్యాంకు సాధించిన నేలకొండపల్లి విద్యార్థి



నేలకొండపల్లి,మే24(ఆంధ్రజ్యోతి): శనివారం ప్రకటించిన పాలీసెట్ ఫలితాల్లో నేలకొండపల్లికి చెందిన పాలడుగు పవన్‌కుమార్ సత్తా చాటాడు. రాష్ట్రస్థాయిలో 17వ ర్యాంకును, జిల్లా స్థాయిలో ద్వితీయ ర్యాంకును సాధించి భళా అనిపించాడు. శనివారం ప్రకటించిన ఫలితాల్లో పవన్‌కుమార్ జిల్లాలో ద్వితీయస్థానాన్ని, రాష్ట్ర స్థాయిలో 17వ ర్యాంకును సాధించాడు. 10వ తరగతిలో సైతం 600మార్కులకు 570సాధించాడు. పవన్‌కుమార్ తండ్రి రామకృష్ణ 108 అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, తల్లి ఉషశ్రీ ఇల్లెందు ప్రభుత్వ కళాశాలలో ఇంగ్లీష్ గెస్టు లెక్చరర్‌గా పని చేస్తున్నారు. పాలీసెట్ కోసం పవన్‌కుమార్ ఎటువంటి కోచింగ్ తీసుకోలేదని, సొంతంగానే ప్రిపేర్ అయ్యాడని చెప్పారు.

ముస్లిం మైనారిటీ జేఏసీ కమిటీ ఎన్నిక

తిరుమలాయపాలెం,మే24(ఆంధ్రజ్యోతి):ముస్లింమైనారిటీ జేఏసీ మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. మండలంలోని జింకలగూడెంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడుగా ఎస్‌డీ సైదా, ఉపాధ్యక్షుడుగా ఎండీ బషీర్, కార్యదర్శిగా ఎస్‌కేసుబాని సహాయ కార్యదర్శిగా ఎస్‌కే బాబు, కోశాధికారిగా మల్సూర్, గౌరవ సలహాదారులుగా ఎస్‌బీ హస్సేన్, మౌలానా యాసిన్‌తోపాటు మండలంలోని 16మసీదు కమిటీ సదర్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సాదిక్అలీ, జాకీర్, నజీర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంస్పోర్ట్స్, మే24(ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. తనక్యాంపు కార్యాలయంలో రూ. 2.5 లక్షల విలువైన చెక్కులను ఆయన అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు తోట వీరభద్రం, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లేడిబోయిన గోపాలరావు ఉన్నారు.



ప్రతీ వ్యాపారికి ట్రేడ్ లైసెన్స్‌లు జారీచేయాలి

ఖమ్మంసంక్షేమ విభాగం, మే24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ప్రతీ వ్యాపారికి ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయాలని కమర్షియల్ ప్రాంతాలతో పాటుగా నివాస ప్రాంతాల్లోను సర్వేలు నిర్వహించి గుర్తించాలని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ ఆహ్మద్ షఫీ ఉల్లా ఆదేశించారు. శనివారం కేఎంసీలో బిల్‌కలెక్టర్లు, వార్డుఆఫీసర్లు, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. త్వరగా లైసెన్స్‌లు జారీ చేసే అంశాలపై వివరించారు. అలాగే 100 రోజుల పారిశుధ్య యాక్షన్ ప్లాన్‌పై మార్గదర్శకాలు వివరించారు. జూన్2 నుంచి వందరోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలన్నారు. పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డు ఆఫీసర్లు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను ఏఎంసీ దృష్టికి తీసుకెళ్లారు.


మాట్లాడుతున్న షఫీ ఉల్లా

నేలకొండపల్లి సీహెచ్‌సీని సందర్శించిన 108 సర్వీసుల జిల్లా మేనేజర్


108లో సౌకర్యాలను పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ శివకుమార్

నేలకొండపల్లి, మే24 (ఆంధ్రజ్యోతి): 108 సర్వీసుల జిల్లా నూతన మేనేజర్ శివకుమార్ శనివారం మధ్యాహ్నం నేలకొండపల్లిలోని సీహెచ్‌సీని సందర్శించారు. సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న 108, 102, నియోనేటల్ అంబులెన్స్ సేవలను పరిశీలించారు. 108లో ఉన్న అధునాతన సౌకర్యాలు సరిగా పని చేస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. 108, 102 సర్వీసుల్లో ఏర్పాటు చేసిన మానిటర్, సిరంజీ పంపు, వెంటిలేటర్, బేబీ వార్మర్‌ల గురించి, వాటిని ఎలా ఉపయోగించాలో వైద్యశాల సిబ్బందికి సవివరంగా వివరించారు. 108 సేవలను అందరికీ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాజేష్, 108 సర్వీసుల జిల్లా అధికారి దుర్గాప్రసాద్, నియోనేటల్ అంబులెన్స్ సిబ్బంది భాస్కర్, సీతారాం, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వైరా మండల అధ్యక్షుడిగా సురేందర్

వైరా, మే 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వైరా మండల కమిటి అధ్యక్షుడిగా కిలారు సురేందర్ ఎన్నికయ్యారు. శనివారం టీడీపీ మండల కార్యాలయంలో ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం సమక్షంలో మండల కమిటి ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా కిలారు సురేందర్, కార్యదర్శిగా గాలి రామకృష్ణను ఎన్నుకున్నారు. ఎన్నిక ధృవీకరణ పత్రాన్ని డాక్టర్ రామనాథం అందజేశారు.

మధిర మండల అధ్యక్షుడిగా పుల్లారావు

మధిరరూరల్: మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా మారేడు పుల్లారావు ఎంపికయ్యారు. శనివారం మధిరలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గ్రామకమిటీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో పుల్లారావును ఎన్నుకున్నారు. వాసిరెడ్డి రామనాథం అధ్యక్షతన ఈ ఎన్నిక జరిగింది.

భూమిని కాపాడాలని స్థానికుల ఆందోళన

ముదిగొండ, మే 24 (ఆంధ్రజ్యోతి): గ్రామకంఠ భూమిని కాపాడాలని గ్రామస్థులు పంచాయతీ కార్యాలయంలో బైఠాయించారు. ఈ సంఘటన ముదిగొండ మండలం వల్లాపురంలో శనివారం జరిగింది. గ్రామకంఠం భూమిని ఓ వ్యక్తి ఆక్రమించాడని, భూముల్లో పాతిన ప్రభుత్వ బోర్డులు తొలగించి అక్రమార్కులు కబ్జాలు చేస్తున్నా పట్టించుకోని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నమోదును పెంచండి

శిక్షణ ముగింపు సభలో ఎంఈఓ చలపతిరావు

నేలకొండపల్లి, మే24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ, ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను వివరించాలని, తద్వారా విద్యార్థుల నమోదును పెంచాలని మండల విద్యాధికారి బాలిన చలపతిరావు ఉపాధ్యాయులను కోరారు. నేలకొండపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదురోజుల పాటు నిర్వహించిన ఉపాధ్యాయ శిక్షణ ముగింపు సమావేశంలో చలపతిరావు మాట్లాడారు. శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించటం ద్వారా నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలు, అందుతున్న విద్యను పిల్లలకు, వారి తల్లిదండ్రులకు వివరించటం, ప్రభుత్వ బడిపై నమ్మకం పెంచాలన్నారు. ద్వారా విద్యార్థుల నమోదును పెంచాలని ఎంఈవో అన్నారు. ప్రభుత్వ బడులను, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తయారు చేయాలని చలపతిరావు కోరారు.


మాట్లాడుతున్న చలపతిరావు

పోడు సాగుదారులకు పట్టాలివ్వాలి

కొణిజర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పోడు సాగుచేసుకుంటున్న పేదలందరికి పట్టాలివ్వాలని అఖిల భారత ఐక్య రైతుకూలి సంఘం రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. ఆ సంఘం వైరా డివిజన్ ప్రథమ మహాసభ మేడికొండలు అధ్యక్షతన శనివారం మండలంలో నిర్వహించారు.

90.706 కేజీల గంజాయి దహనం

తల్లాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమిషనరేట్‌లో వివిధ పోలీసు స్టేషన్లలో పట్టుబడి సీజ్ చేసిన 90.706 కిలోల ఎండు గంజాయిని అదనపు డీసీపీ అడ్మిన్ నరేష్‌కుమార్, టాస్క్‌ఫోర్సు ఏసీపీ రవి పర్యవేక్షణలో శనివారం తల్లాడ మండలం గోపాలపేటలోని ఏడబ్ల్యుఎం వేస్టేజ్ బర్నింగ్ ప్లాంట్‌లో అధికారులు దహనం చేశారు. ఖమ్మం వన్‌టౌన్, త్రీటౌన్, ఖమ్మంరూరల్ ఖానాపురంహవేలి, కూసుమంచి, వైరా, నేలకొండపల్లి, తల్లాడ, తిరుమలాయపాలెం, సత్తుపల్లి వేంసూరు, వీఎం బంజర, ఏన్కూరు పోలీస్ స్టేషన్లకు సంబంధించి 17కేసుల్లో గంజాయి రవాణ, అమ్మకాలు జరిపిన నేరస్తులను అరెస్టు చేసి వారి నుంచి గంజాయిని స్వాధీనంచేసుకున్నట్లు ఏడీసీపీ తెలిపారు.

ఉపాధి చట్టానికి కేంద్రం సంకెళ్లు



ఉపాధి కూలీలతో సమావేశమైన శ్రీనివాస్

సత్తుపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ అన్నారు. శనివారం సత్తుపల్లి మండలం బేతుపల్లిలో ఉపాధి కూలీలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తగ్గించి పేదలను ఉపాధికి దూరం చేయాలని చూస్తోందని ఆరోపించారు. ఉపాధి పథకంలో కొలతలు విధానం, రెండు పూటల పని, పని ప్రదేశంలో ఫొటో దించటం లాంటి కొత్త నిబంధనలతో ఉపాధి కూలీలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. గుట్టలు, పంట కాలువలలో పని చేస్తున్న సమయంలో చాలా తక్కువ వేతనాలు అందుతున్నాయని అన్నారు. 200 రోజులు పని కల్పించి కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలీ రూ.ఆరు వందలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ పక్కా ఇళ్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు బెజవాడ లక్ష్మీనారాయణ, గుంజి సత్యం, నిర్మల, అలివేలు, రాంబాబు, జ్యోతి, జగపతిరావు, సీతారత్నం, వరలక్ష్మిలు పాల్గొన్నారు.

పోడు సాగుదారులకు పట్టాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న అచ్చయ్య

కొణిజర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పోడు సాగుచేసుకుంటున్న పేదలందరికి పట్టాలివ్వాలని అఖిల భారత ఐక్య రైతు కూలి సంఘం రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. ఆ సంఘం వైరా డివిజన్ ప్రథమ మహాసభ మేడికొండలు అధ్యక్షతన శనివారం మండలంలో నిర్వహించారు. ఈ మహాసభలో ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కల్తీ విత్తనాలను అరికట్టాలని, రైతులందరికి సబ్సిడీ ద్వారా విత్తనాలు ఇవ్వాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రెండు లక్షల రుణమాఫిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలపై రైతులు ఐక్యతతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కేంద్రం, ఉన్న ఉద్యోగాలను ఊడపీకుతుందని, కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. మహాసభ సందర్భంగా 11మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు మలీదు నాగేశ్వరరావు, కొల్లేటి నాగేశ్వరావు, కేలోతు లక్ష్మణ్, పాశం అప్పారావు, పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఎస్‌కే లాల్‌మియా, పుల్లయ్య, సోములు, రమేష్, వెంకన్న, కృష్ణ, చిన్నబాబు, శ్రీను, సురేష్, రమేష్, లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధిలో బాల్యమిత్రులు

- మౌలిక వసతి, ఆధ్యాత్మిక రంగాల్లో సేవలు
- విద్యాబుద్ధులు నేర్పిన ఊరికి కృతజ్ఞతగా
- ఇప్పటికే చిన్నకోరుకొండిలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు
- సమాజ సేవలో ఆదర్శం



గుజ్జు చిన్నపుల్లాదాసు, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఆర్అండ్‌బీ



గుజ్జు పెద్దపుల్లాదాసు విశ్రాంత ఎస్ఐ



కుమ్మరి రామారావు విశ్రాంత ఏఎస్ఐ

కల్లూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పిన ఊరికి ఎంతో కొంత రుణం తీర్చుకోవాలన్న సంకల్పంతో ఓ గ్రామానికి చెందిన ముగ్గురు బాల్యమిత్రులు, విశ్రాంత (ఉద్యోగ) అధికారులు రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామంలో ఒక వైపు మౌలిక వసతుల కల్పన, విద్య, ఆధ్యాత్మిక రంగాల్లో సేవలందిస్తూ గ్రామ అభివృద్ధికి తమ వంతు సేవలందిస్తూ నేటి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఇప్పటికే మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలోని దళిత, బీసీ కాలనీల్లో సీసీ రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలతోపాటుగా చిన్నకోరుకొండి టు అంధ్రా సరిహద్దున గల నెమలి వెళ్లేందుకు బీటి రహదారిని కూడ నిర్మించారు. ఇంక కొంత వరకు పనులు జరగాల్సి ఉంది, మధ్యలో రహదారి నిర్మాణం పూర్తియితే చిన్నకోరుకొండి తదితర గ్రామాల ప్రజలకు జిల్లా కేంద్రమైన ఖమ్మం వెళ్లేందుకు సులభంగా ఉంటుంది. కల్లూరు మండలం చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన గుజ్జు పెద్ద పుల్లాదాసు, చిన్నపుల్లాదాసు, కుమ్మరి రామారావులు బాల్యమిత్రులు, అదే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1 నుంచి 10 వ తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ముగ్గురిలో గుజ్జు చిన్నపుల్లాదాసు ఆర్ అండ్‌బిలో చీఫ్ ఇంజనీర్‌గా, పెద్దపుల్లాదాపు ఎస్సైగా, కుమ్మరి రామరావు ఏఎస్సైగా పనిచేసి ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు. పుట్టిన ఊరికి ఏదో చేయాలన్న తపనతో వారి తల్లిదండ్రులను ఆదర్శంగా తీసుకుని ఈ ముగ్గరు బాల్యమిత్రులు గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో గడచిన మూడు సంత్సరాలుగా ముందకు సాగుతున్నారు.



గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయం

రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులు....

గుజ్జు చిన్నపుల్లాదాసు రాష్ట్ర స్థాయిలో అర్ అండ్‌బి శాఖ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసిన అనుభవంతో తనకున్న పరిచయాలతో రాష్ట్ర మంత్రుల, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో గల ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వం తరుపున గ్రామాభివృద్ధికి 3 కోట్ల నిధులు మంజూరు చేయించారు. చిన్నకోరుకొండిలోని దళిత కాలనీల్లో అంతర్గత సీసీ రహదారులు, వాటిపై మోరీలు, ర్యాంప్‌లు, డ్రైన్లు నిర్మించారు. వాటిలో ఇంకా కొన్ని డ్రైన్ల పనులు జరుగుతన్నాయి. ఇంకా జరగాల్సిన పనులకు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అనమతితో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

ఆధ్యాత్మిక, గ్రామా అభ్రిద్ధి సేవలో.....

మూడు సంత్సరాల క్రితం పోలీస్ శాఖలో ఉద్యగ విరమణ చేసినప్పట్టి నుంచి చిన్నకోరుకొండి గ్రామంలో గుజ్జు పెద్దపుల్లాదాసు, కుమ్మరి రామారావులు ఆధ్యాత్మిక, సామాజిక రంగాల్లో సేవలందిస్తున్నారు. చిన్నకోరుకొండిలో దాతల, టీటీడీ వారి సహకారంతో తమ వంతుగా చేయూతనిస్తూ నూతనంగా శ్రీసీతారామ, లక్ష్మణ, అంజనేయస్వామి వారి ఆలయాలను నిర్మించారు. గ్రామంలో ఈ ఆలయంలో పలు ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తుల ఆదరణ పొందుతున్నారు. అదే బాటలో కుమ్మరి రామారావు కూడా మరో ఆలయంలో మౌలిక వసతి కల్పనలో తోడ్పాటు అందిస్తున్నారు. నిరుద్యోగలకు ఉద్యోగ కల్పనకై ప్రత్యేక స్టడీ నిమిత్తం మినీ గ్రంథాలయం ఏర్పాటులో తోడ్పాటు అందించారు. చెరువుల మరమ్మతుల్లో అధికారుల సహకారంతో అభివృద్ధి పరిచారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఆయా ప్రజా ప్రతినిధులను గ్రామ ప్రజల అవసరాల కోసం మెప్పించడంలో వారిది అందవేసిన చేయి. గ్రామ అభివృద్ధిలో పై ముగ్గురు విశ్రాంత అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ రాజకీయాలకు అతీతంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేయిస్తూ ఆదర్శంగా నిలిచారని చెప్పవచ్చు. వీరి సంకల్పానికి గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు.

మధిర మండల టీడీపీ అధ్యక్షుడిగా పుల్లారావు

మధిరరూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మధిర మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా మారేడు పుల్లారావు ఎంపికయ్యారు. శనివారం మధిరలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గ్రామకమిటీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో పుల్లారావును ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. జిల్లాపార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విశ్వధర్మక్షేత్రానికి రూ.30లక్షల విరాళం

సత్తుపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి):సత్తుపల్లి మండలం బుగ్గపాడులోని శ్రీ విశ్వధర్మక్షేత్రంలో నిర్మితమవుతున్న అన్నపూర్ణేశ్వరి దేవాలయ శిఖర నిర్మాణానికి రూ.మూడు లక్షల విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన వెదుళ్ళ శివరామకృష్ణ అనే భక్తుడు అందజేసారు. శనివారం ఆయన శ్రీ విశ్వధర్మ క్షేత్రం సందర్శించి ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం విరాళం అందజేసారు.

గుడిపాడులో పెద్దమ్మ తల్లి మహోత్సవం

సత్తుపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని గుడిపాడులో శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి తిరునాళ్ళ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 21 వ తేదీన తిరునాళ్ళ ప్రారంభం కాగా ఆదివారంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఊరేగింపు, అన్నప్రసాద కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు.

జాబ్‌మేళాకు భారీగా తరలిన యువత



వైరాకు తరలివెళ్తున్న నిరుద్యోగులు

కారేపల్లి, 24 (ఆంధ్రజ్యోతి): వైరా పట్టణంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేగా జాబ్‌మేళ్లాకు కారేపల్లి మండలం నుంచి వివిధ వాహనాల ద్వారా 15వందల మందికి పైగా నిరుద్యోగ యువతి, యువకులు తరలివెళ్లారు. నిరుద్యోగ యువకులను వాహనాలలో తరలించేందకు తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీంద్రప్రసాద్‌తోపాటు మండల పార్టీ కాంగ్రెస్ నాయకులు గ్రామపంచాయతీ కార్యదర్శుల సహకారంతో పలువాహనాల ద్వారా తరలివెళ్లారు. అవసరమైన అన్నీ ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

టీడీపీ వైరా మండల అధ్యక్షుడిగా సురేందర్



సురేందర్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ వాసిరెడ్డి

వైరా, మే 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వైరా మండల కమిటి అధ్యక్షుడిగా కిలారు సురేందర్ ఎన్నికయ్యారు. శనివారం టీడీపీ మండల కార్యాలయంలో ఖమ్మం పార్లమెంటరీ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం సమక్షంలో మండల కమిటి ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా కిలారు సురేందర్, కార్యదర్శిగా గాలి రామకృష్ణను ఎన్నుకున్నారు. ఎన్నిక ధృవీకరణ పత్రాన్ని డాక్టర్ రామనాథం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెరుకూరు చలపతిరావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, మందడపు మధుసూదన్‌రావు, కోటా దాసు, చావా కాంతారావు, మన్నెపల్లి ప్రదీప్, బొల్లెపల్లి శ్రీనివాసరావు, మద్దినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

భూమిని కాపాడాలని స్థానికుల ఆందోళన



జీపీ కార్యాలయంలో బైఠాయించి ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ముదిగొండ, మే 24 (ఆంధ్రజ్యోతి): గ్రామకంఠ భూమిని కాపాడాలని గ్రామస్థులు పంచాయతీ కార్యాలయంలో బైఠాయించారు. ఈ సంఘటన ముదిగొండ మండలం వల్లాపురంలో శనివారం జరిగింది. గ్రామకంఠం భూమిని ఓ వ్యక్తి ఆక్రమించాడని, భూముల్లో పాతిన ప్రభుత్వ బోర్డులు తొలగించి అక్రమార్కులు కబ్జాలు చేస్తున్నా పట్టించుకోని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామకంఠానికి చెందిన భూమి పరిరక్షించాలని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ సరైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ భూమిని ఆక్రమించుకున్న వ్యక్తికి మద్దతుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలో ఉన్న భూమిని పరిరక్షించాలని లేకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమాచారం తెలుసుకున్న ఎంపీవో వాల్మీకి కిషోర్ సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామకంఠ భూమిని వివరాలను పరిశీలించి పరిరక్షిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



డి అనుశ్రీ



కె పార్థు



పి రిషిత

కల్లూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) ఖమ్మంలోని సర్ధార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథెటిక్స్ పోటీలలో పాల్గొన దలిచిన క్రీడాకారుల జట్టును శనివారం ఎంపిక చేశారు. కల్లూరు నుంచి పోటీలలో పాల్గొని ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిలో కోలా పార్థు 60 మీటర్, 300 మీటర్ల పరుగు పందేం నందు ప్రథమ స్థానం, ధర్మసోతు అనుశ్రీ 300 మీటర , 60 మీటర్స్ పి.రిషిత 600 మీటర్ల పరుగు పందెము నందు ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి 33 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలు జింఖానా క్రీడా మైదానంలో త్వరలో జరగనున్నాయి. పోటీలలో పాల్గొని అర్హత సాధించిన ముగ్గురు క్రీడాకారులను పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఖమ్మం వారు, తల్లిదండ్రులు అభినందించారు. ఫిజికల్ ట్రైనర్ నాగబాబు, ఖమ్మం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షఫిక్ అహ్మద్, శిక్షకుడు మహ్మద్ గౌస్, క్రీడల అభివృద్ధి అధికారి దయాకర్‌రెడ్డి, ఎంఈఓ నివేదిత, మినీ స్టేడియం ఇన్‌చార్జి పి వీర రాఘవయ్య కోచ్‌లు గౌతమ్‌రెడ్డి, జి శ్రీనివాస్‌లు వారిని అభిందించారు.

ఘనంగా నల్లమల గిరిప్రసాద్ వర్ధంతి

మధిరరూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మాజీ రాజ్యసభ సభ్యుడు దివంగత సీపీఐ సీనియర్ నేత నల్లమల గిరిప్రసాద్ వర్ధంతి వేడుకలను సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మధిర మండలం తొండలగోపవరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బెజవాడ రవి బాబు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు పోరాడిన గిరిప్రసాద్ కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఎంఎ రహీం, ప్రకాశరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానించి, జ్ఞాపికలు అందిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను శనివారం సన్మానించి జ్ఞాపికను అందించారు. మండలంలోని పదో తగరతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించిన 24మంది విద్యార్థులను శాలువాలతో ఫౌండేషన్ వారు సన్మానించగా, జ్ఞాపికలను ఎంఈవో మురళీమోహన్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటుపాఠశాలలకు ధీటుగా ఈ ఏడాది 7పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు అత్యధిక మార్కులు సాధించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా జీఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు జంగా గురునాథ్రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో హైకేర్ ఆసుపత్రి డాక్టర్ నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు మన్మోహన్‌రెడ్డి, మారపాక బాబురావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ స్థంభాల ఏర్పాటుకు భూమిపూజ

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



విద్యుత్ స్థంభాల ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని జంగాల కాలనీలో రూ.14.5లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న విద్యుత్ లైన్‌కు శనివారం రాత్రి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా జంగాల కాలనీలో 80 స్థంభాలతో విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాలనీలో త్వరలో డ్రైనేజీ, ఇంటింటికీ మంచినీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో 40 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు డ్వాక్రా మహిళలు అదనంగా రూ.లక్ష పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులతో పాటు మునిసిపల్ కమీషనర్ నరసింహ పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తల్లాడ, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శనివారం తల్లాడ ఆర్‌బీ గార్డెన్స్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలు వల్ల పేదలకు ఖర్చులు తగ్గి కుటుంబ ఆదాయం ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఆర్డీవోరాజేంద్రగౌడ్, హౌజింగ్ డీఈ జగ్గురామ్, మండల ప్రత్యేక అధికారి శివప్రసాద్, సొసైటీ చైర్మన్లు దిరిశాల నరసింహారావు, తూము వీరబద్రరావు, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో సురేష్‌బాబు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, ఏఎంసీ మాజీచైర్మన్ దీవెల కృష్ణయ్య, నాయకులు జక్కంపుండి కిషోర్, రాయల రాము తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలో వచ్చాకే పేద వాడి ఇంటి నిర్మాణం కల నేరవేరుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. శనివారం కల్లూరులో పలు గ్రామాల్లో ఇందిర్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు అందించారు. ఇందిర్మ గృహాలు పట్టాలు అందుకున్న లబ్ధిదారులు త్వరతగతిన ఇళ్లు నిర్మించకుంటే ప్రభుత్వం తరుపున వారి ఖాతాల్లో నేరుగా బిల్లులు జమా చేయటం జరగుతుందన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు సంబంధించి 750 మంది ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులకు పట్టాల ప్రోసిడింగ్స్ పత్రాలను ఎమ్మెల్యే రాగమయి అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎల్ రాజేంద్రగౌడ్, ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, ఎంపిడిఓ చంద్రశేఖర్, తహసిల్దార్ సాంబశివుడు, కాంగ్రెస్ నాయకులు పోట్రు అర్జునరావు, ఏనుగు సత్యంబాబు, తోటకూర శేషగిరావు, యస్‌కె ఉస్మాన్, ఎస్‌కె బాజీ, మాదిరాజు అన్నమరాజు, కొండపల్లి శ్రీమన్నారరాయణ, తక్కేళ్లపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

నిర్వాసితులకు నిధులు మంజూరు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న రాంబాబు

ఏన్కూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ లింక్‌కెనాల్ భూ నిర్వాసితుల పెండింగ్ నిధులను వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హిమాంనగర్ వద్ద జరుగుతున్న లింక్ కెనాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావస్తున్నా నేటికి రైతులందరికి నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంకా 15 ఎకరాలకు సంబంధించి 20మంది రైతులకు నష్టపరిహారం అందాల్సి ఉందన్నారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీ, గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, పాపారావు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

కారేపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ నెల 20న ప్రాంరంభమైన శిక్షణలో ప్రధానంగా భాష, గణిత సామర్థ్యాల సాధనలపై 120 మంది ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యాశాఖాధికారి జయరాజ్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బి.శ్యామ్‌లాల్, ఎల్.లక్ష్మణ్, బి.శ్రీను, బి.రామకోటి, ఎండి జాకీర్‌బాబా, కె.బాలాజీ, మోహన్, బి.వీరన్న మండల రిసోర్స్‌పర్సన్‌గా వ్యహరించారు.

పదోతరగతి మండల ర్యాంకర్‌కు సన్మానం

ఇటీవల వెలువడిన పదవతరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో ఫస్ట్‌ర్యాంకర్‌గా నిలిచిన మాధారం జేడిఏవి పాఠశాలకు చెందిన విద్యార్థిని చాగంటి సాయి మన్వితను ఎంఈవో డి.జయరాజ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

సరైన బోధనతో ఉత్తమ ఫలితాలు



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏఎంవో రవి కుమార్

బోనకల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మెరుగైన విద్యా బోధనతోనే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చునని ఏఎంవో రవి కుమార్ తెలిపారు. మండలంలోని రావినూతల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. మారుతున్న కాలనుగుణంగా బోధనలో కూడా మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మానిటరింగ్ ఎక్కువగా ఉంటుందన్నారు. అధికారులు పాఠశాలలను తనిఖీ చేసే క్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని అంశాలను పరిశీలిస్తారని తెలిపారు. ప్రధానంగా టీచర్లు భోదన ఏ పద్ధతిలో చేస్తున్నారన్న విషయాన్ని పరిశీలించడం జరుగనున్నందున శిక్షణలో చెప్పిన అంశాలను తరగతి గదుల్లో అమలు చేయాలన్నారు.అనంతరం రిసోర్స్ పర్సన్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దామాల పుల్లయ్య, రిసోర్స్ పర్సన్లు నర్సింహారావు, పద్మావతి, లవకుశ, యాకుబ్ పాషా, రంగారావు, ప్రసాద్, ఉషా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైరా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- డిప్యూటీ సీఎంకు సీపీఎం నాయకుల వినతి



భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వైరా, మే 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న వైరా మునిసిపాలిటి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు సీపీఎం డివిజన్ కమిటి కార్యదర్శి భూక్యా వీరభద్రం ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. మునిసిపాలిటీ పరిధిలో కూలీలు ఉపాధి పనిలేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. వెంటనే స్పందించన భట్టి విక్రమార్క వైరా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుంకర సుధాకర్, మచ్చామణి, పారుపల్లి కృష్ణారావు, కొంగర సుధాకర్, గుడిమెట్ల మోహన్‌రావు, బానోతు రవి, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.